క్రీడలతో ఉజ్వల భవిత

సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్



శిబిరం ముంగిపు కార్యక్రమంలో పాల్గొన్న సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్ తదితరులు

కాచిగూడ: ప్రస్తుతం దేశ వ్యాప్తంగా క్రీడలకు ఆదరణ పెరిగిందని, క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సుల్తాన్‌బజార్ ఏసీపీ కె.శంకర్ అన్నారు. వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నారాయణగూడలోని వైఎంసీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించిన విద్యార్థుల 43వ వార్షిక వేసవి శిక్షణ తరగతుల ముంగిపు కార్యక్రమంలో ఏసీపీ పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్స్, బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థులు చిన్న వయస్సులోనే విద్యతో పాటు క్రీడలపట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుత కాలంలో క్రీడలకు అపూర్వ స్పందన వస్తుందని, తల్లిదండ్రులు వారి పిల్లలను ఏదో క్రీడలో పాలు పంచుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఏదో ఒక క్రీడలో ఆడాలన్నారు. అప్పుడే వారు అలసట లేకుండా ఉత్సాహంగా ఉంటారన్నారు. వైఎంసీఏ ఆధ్వర్యంలో ప్రతి ఏటా వేసవి క్రీడా, సాంస్కృతిక శిక్షణ శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని ఏసీపీ శంకర్ అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల క్రీడా, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ పి.జోనతన్ ధర్మరాజ్, ప్రధానకార్యదర్శి ప్రిస్టిలీ గైస్, బీజే వినయ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

ఊహకందని అంచనాలు..
అనూహ్య ఫలితాలు !

- రెండో స్థానంలో బీజేపీ, మూడో స్థానానికి పడిపోయిన బీఆర్ఎస్
- 12 రౌండ్‌లలో కాంగ్రెస్, 5 రౌండ్‌లలో బీజేపీ ముందంజ



రౌండ్‌ల వారీగా వచ్చిన ఓట్లు..

రౌండ్	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్	లీడ్
1.	3,995	2,666	3,140	855
2.	3,709	1,517	2,239	1470
3.	4,344	1,199	2,331	2013
4.	2,437	1,920	1,662	517
5.	3,655	1,858	2,367	1,288
6.	3,288	2,575	2,935	353
7.	2,996	2,977	2,087	19
8.	2,902	2,612	1,780	290
9.	2,450	2,787	1,558	337 (బీజేపీ)
10.	1,890	2,776	1,390	886 (బీజేపీ)
11.	3,657	2,711	1,991	946
12.	3,092	1,597	1,673	1,419
13.	3,359	1,736	1,546	1,623
14.	3,622	2,180	2,164	1,442 (బీజేపీ)
15.	2,962	3,363	1,955	401 (బీజేపీ)
16.	2,868	3,797	1,966	929 (బీజేపీ)
17.	2,048	1,970	1,437	78
పోస్టల్	377	204	241	136
మొత్తం	53,651	40,445	34,462	13,206

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎన్. శ్రీగణేశ్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. పరిశీలకుల అంచనాలను తారుమారు చేస్తూ కంటోన్మెంట్‌లో మరోసారి బీజేపీ రెండో స్థానంలో నిలిచింది. ఆరు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో 17 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచిన బీఆర్ఎస్ పార్టీ మూడో స్థానానికి పడిపోయింది. మంగళవారం ఉదయం కౌంటింగ్ ప్రారంభానికి ముందు వరకు నియోజకవర్గంలో మెజారిటీ నేతలు, కార్యకర్తలు పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్యే ఉంటుందని భావించారు. పోస్టల్ బ్యాలెట్‌తో పాటు తొలి మూడు రౌండ్‌ల వరకు కాంగ్రెస్ మొదటి స్థానంలో, బీఆర్ఎస్ రెండో స్థానంలో ఉన్నాయి. నాలుగో రౌండ్‌లో బీజేపీ రెండోస్థానంలో నిలిచింది. మళ్లీ 5, 6 రౌండ్‌లో బీఆర్ఎస్, ఏడో రౌండ్‌లో మళ్లీ బీజేపీ రెండో స్థానంలోకి వచ్చాయి. ఇక 12వ రౌండ్‌లో రెండోస్థానం మినహా, అన్ని రౌండ్‌లలోనూ బీఆర్ఎస్ మూడో స్థానంలోనే ఉంటూ వచ్చింది. బీఆర్ఎస్ ఏ రౌండ్‌లోనూ ఆధిక్యం కనబరచలేదు. ఉన్నట్టుండి 9, 10, 14, 15, 16 రౌండ్‌లలో బీజేపీ కాంగ్రెస్‌ను దాటి ఒకటో స్థానంలోకి దూసుకెళ్లడం గమనార్హం. ఈ నేపథ్యంలో తుది ఫలితాల్లో బీజేపీ రెండోస్థానంలో నిలిచింది. బీఆర్ఎస్ కంటే బీజేపీకి 5,983 ఓట్లు అధికంగా పోలవడం గమనార్హం. గత ఎన్నికల్లో మూడోస్థానంలో నిలిచిన కాంగ్రెస్ ప్రస్తుత ఎన్నికల్లో విజయం సాధించగా, గతంలో గెలిచిన బీఆర్ఎస్ మూడో స్థానంలోకి పడిపోయింది.

పనిచేయని సెంటిమెంట్

కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నివేదితకు సెంటిమెంట్ కలిసి రాలేదు. ఏడాది వ్యవధిలోనే తండ్రి సాయన్న, సోదరి లాస్య నందిత మృత్యువాత పడటంతో ఆ మేరకు సెంటిమెంట్ పనిచేస్తుందని బీఆర్ఎస్ నేతలు భావించారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ టికెట్ ఆశించిన కార్పొరేషన్ మాజీ చైర్మన్‌లు గజ్జెల నాగేశ్, మన్నె క్రిశాంక్, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌లను కాదని నివేదితకు టికెట్ కేటాయించారు. అయితే బీఆర్ఎస్ నుంచి ఆమెకు ఆశించిన మద్దతు లభించలేదు. బోర్డు మాజీ సభ్యుల మితిమీరిన జోక్యం సహించని పలువురు నేతలు ప్రచారంలో ఉండి ఉండనట్లు వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నేతలు పార్టీని వీడారు. పలువురు కీలక నేతలు ప్రచారానికి దూరంగా ఉన్నారు. ఇక లాస్య నందిత, నివేదితలపై డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో అవినీతి ఆరోపణలు వచ్చాయి. దివంగత నేత సాయన్న ఇమేజ్‌కు సరితూగేలా వ్యవహరించడం లేదని, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో సాయన్న ఇమేజ్ కలిసి రాలేదని తెలుస్తోంది.

పట్టు నిలుపుకున్న బీజేపీ

కంటోన్మెంట్‌లో బీజేపీ ఓటమి పాలైనప్పటికీ, గత ఎన్నికలతో పోలిస్తే స్వల్ప ఓట్లు కోల్పోయినప్పటికీ ద్వితీయ స్థానాన్ని నిలబెట్టుకుంది. నవంబర్‌లో బీజేపీకి 41,888 ఓట్లు పోలవగా, ఉప ఎన్నికల్లో 40,445 ఓట్లు సాధించింది. అయితే మల్కాజ్‌గిరి పార్లమెంట్‌కు సంబంధించి ఇదే నియోజకవర్గం నుంచి ఆ పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఏకంగా 64,133 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ టీఎన్ వంశ తిలక్ సాధించిన ఓట్ల కన్నా 23,668 ఎక్కువ ఓట్లు పోలవ్వడం గమనార్హం.

ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి



చిన్నారెడ్డికి సమస్యలను వివరిస్తున్న వేముల వెంకటేష్

కాచిగూడ: తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డిని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వేముల రామకృష్ణ మాట్లాడుతూ... విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో విద్యార్థుల సమస్యలను పరిష్కరించే నాథుడే లేకుండా పోయారన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని కోరారు. విద్యా హక్కు చట్టం ప్రవేశపెట్టి అందరికీ సమాన విద్యను అందించాలని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అధిక ఫీజులు, విద్యార్థి సంక్షేమం, విద్యా రంగ సమస్యలపై త్వరలోనే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో విద్యార్థులతో కలిసి పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. విద్యారంగాన్ని పట్టి పీడిస్తున్న అధిక ఫీజులపై ఉద్యమించనున్నట్లు వేముల రామకృష్ణ పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి



పైప్‌లైన్ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్

కాచిగూడ: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ జలమండలి అధికారులను కోరారు. బుధవారం జలమండలి అధికారులతో కలిసి కాచిగూడ లింగంపల్లి శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయం లేన్‌లో నూతనంగా చేపడుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణపు పనులను ఆమె పర్యవేక్షించారు. అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని అన్నారు. జలమండలి డీజీఎం సన్యాసిరావు, ఏఈ భావన, బీజేపీ నేతలు కన్నె రమేష్ యాదవ్, కృష్ణకుమార్, ఆర్.సంతోష్ కుమార్, వాసు, శేర్ సాగర్, మల్లికార్జున్, బల్వీర్, నాగరాజు, సూరి, సతీష్, ఎస్.రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తులను ప్రోత్సహించాలి



కవాడిగూడ: చేతివృత్తులను ప్రోత్సహించి వాటిపై ఆధారపడి జీవనోపాధిని పొందుతున్న చేనేత వృత్తి కళాకారులను ఆదుకోవాలని అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు కోటా దేవకీ దేవి కోరారు. బుధవారం ఆమె ఎన్‌టీఆర్ స్టేడియంలో ఏప్రిల్ 13న ఏర్పాటు చేసిన జాతీయ చేనేత సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... చేనేత ఎగ్జిబిషన్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 9 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ ప్రదర్శనలో ప్రత్యేకంగా గద్వాల్ చీరలు, ఉప్పాడ పట్టు, వెంకటగిరి పట్టు, పోచంపల్లి పట్టుచీరలు, కాటన్, కళంకారీ, మాధవరం, ప్యూర్ సిల్క్ , ఛందేరీ కాటన్, గుజరాత్ త్రెడ్‌వర్క్, ప్రొద్దుటూరు కాటన్, మంగళగిరి, భాగల్‌పూర్ చీరలు, లక్నో నైటీస్, బెంగాలీ కాటన్, కశ్మీర్ శారీస్, ఖాదీ షెట్స్, లక్నోటాప్స్, వెస్టన్ టాప్స్, కిడ్స్ వేర్ అందుబాటులో ఉన్నాయని ఆమె వివరించారు. వీటితో పాటు వివిధ రకాల క్రాఫ్ట్ ఐటమ్స్ కొండపల్లి బొమ్మలు, పూసలతో తయారు చేసిన జివెలరీ, గాజులు, పిండివంటలతో కూడిన 150 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

రూ. 5 లక్షల విలువచేసే 4 ద్విచక్ర వాహనాల స్వాధీనం



నిందితుడు అమర్‌సింగ్‌తో స్వాధీనం చేసుకు 4 ద్విచక్ర వాహనాలు

చిక్కడపల్లి: ద్విచక్ర వాహనాల దొంగతనాలకు అలవాటుపడ్డ ఓ పాత నేరస్తుడిని చిక్కడపల్లి పోలీసులు పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సీతయ్య సమాచారం మేరకు... గత నెల 29న అశోక్‌నగర్‌లో ఓ వ్యక్తి యాక్టివా వాహనం ఇంటి వద్ద పార్క్ చేశాడు. ఆ వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు... ఈ కేసును సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ సాయంతో కేసును ఛేదించామని పోలీసులు తెలిపారు. నేపాల్‌కు చెందిన బిషూకర్మ అమర్‌సింగ్ (28) కుటుంబం సికింద్రాబాద్‌లోని అడ్డగుట్ట ప్రాంతంలో నివస్తుంది. 8వ తరగతి వరకు చదువుకున్న ఇతను ఆ తర్వాత జల్సాలకు అలవాటు పడి మద్యానికి బానిస అయ్యాడు. అడ్డాకూలీ పనులు చేస్తూనే డబ్బులు సరిపోకవడంతో ద్విచక్ర వాహనాల చోరీకి అలవాటు పడ్డాడు. పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుని వాటి సైడ్ లాక్స్ విరగొట్టి చోరీ చేసి మార్కెట్లో అమ్మేస్తాడు. గతంలో ఇతన్ని 2017లో మారేడ్‌పల్లి, గోపాలపురం, ఉప్పల్, మార్కెట్ పీఎస్, నెరేడ్‌మెట్, మేడిపల్లి పీఎస్‌లలో జరిగిన చోరీ కేసుల్లో పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా దొంగిలించిన వాహనాలను అమ్మేందుకు ప్రయత్నిస్తున్న ఇతనిని హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. అతనిపై ఆరు కేసులు ఉన్నట్లు గుర్తించారు. 4 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితుడిని తదుపరి దర్యాప్తు కోసం చిక్కడపల్లి పోలీసులకు అప్పగించారు. సెంట్రల్ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రామకృష్ణ, ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ నిందితుడిని పట్టుకున్నారు. దొంగను 9వ ఏసీఎంఎం నాంపల్లి కోర్టులో హాజరుపరచగా అతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.

కిషన్‌రెడ్డి విజయం కార్యకర్తలకు అంకితం: చింతల

బంజారాహిల్స్: సికింద్రాబాద్ లోక్‌సభ సభ్యుడిగా విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డికి ఖైరతాబాద్ నియోజకవర్గం ప్రజల తరఫున శుభాకాంక్షలు చెబుతున్నామని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. నియోజకవర్గ ప్రజలు ప్రధాని నరేంద్రమోదీని హ్యాట్రిక్ పీఎంగా చూడాలనుకున్నారని.. అందుకే ప్రజాసేవకు మారుపేరుగా నిలిచిన కిషన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకున్నారన్నారు. పెద్ద ఎత్తున ఓట్లు వేసి ఖైరతాబాద్ నియోజక వర్గంలో బీజేపీకి 16,540 ఓట్ల మెజార్టీని ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కార్యకర్తలు ఈ విజయంలో కీలక పాత్ర పోషించారని ప్రతిక్షణం కిషన్‌రెడ్డి గెలుపు కోసం కష్టపడ్డారని ఈ గెలుపును కార్యకర్తలకే అంకితమిస్తున్నానని వెల్లడించారు. సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో కిషన్‌రెడ్డిని ఆదరించి గెలిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ప్రతి లోక్‌సభ ఎన్నికల్లోనూ ఖైరతాబాద్‌లో ప్రజలు కమలం వైపే నిలుస్తున్నారని వారంతా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావాలని కట్టుబడి ఉండి ఓట్లు వేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఎప్పటిలాగానే కిషన్‌రెడ్డి ద్వారా తామిచ్చిన హామీలు, చేయాల్సిన అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని అన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి శుభాకాంక్షలు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో విజయ దుందుభి మోగించిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సేవారత్న అవార్డు గ్రహీత వెన్న ఈశ్వరప్ప బుధవారం తన నివాసంలో శుభాకాంక్షలు తెలిపారు. ఆయన విజయానికి కారణమైన నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలుపుతూ రానున్న కాలంలో బీజేపీని మరింతగా బలోపేతం చేస్తామని తెలిపారు.

జీహెచ్‌ఎంసీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి అదృశ్యం



పి.వంశీరావు

కాచిగూడ: జీహెచ్‌ఎంసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ డి.సుభాష్ సమాచారం మేరకు... కాచిగూడకు చెందిన దుర్గారావు కుమారుడు పి.వంశీ రావు జీహెచ్‌ఎంసీలో అవుట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తాడు. ఈ నెల 3వ తేదీన ఇంటి నుంచి వెళ్లి ఆయన తిరిగి రాలేదు. వివిధ ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ అభించలేదు. దీంతో తండ్రి దుర్గారావు బుధవారం కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధించాలి

ఉప్పల్: రోడ్లపై చెత్త వేసే వారిపై జరిమానాలు విధించి కఠిన చర్యలు తీసుకోవాలని ఉప్పల్ జీహెచ్‌ఎంసీ అధికారులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. ఉప్పల్ బస్తీల్లో పర్యటనలో భాగంగా బుధవారం ఉప్పల్ భరత్‌నగర్‌లోని కల్లు కాంపౌండ్ వద్ద పేరుకుపోయిన చెత్తను చూసి విస్తుపోయారు. వెంటనే శానిటేషన్ విభాగం అధికారులను పిలిపించి సమస్యను చూపించారు. జీహెచ్‌ఎంసీకి సంబంధించిన ఖాళీ స్థలాలు ఉంటే అక్కడ చెత్త వేయకుండా ఉండే విధంగా ఫెన్సింగ్ వేయాలని, చెత్త వేసే పాయింట్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో చెత్తతో మరింత ఇబ్బంది కలిగే అవకాశం ఉన్నందున చర్యలను ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆకుల మహేందర్, పల్లి నాగరాజు, మేకల సర్వారెడ్డి, నిరంజన్, సుక్క కిరణ్, రంగా, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్ల సమస్యల పరిష్కారానికి కృషి



అంబికకు నియామక పత్రాన్ని అందజేస్తున్న కృష్ణ

కాచిగూడ: మున్సిపల్ స్వీపర్స్, కామాటీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలంగాణ మున్సిపల్ స్వీపర్ అండ్ కమాటి వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు గాలిపల్లి కృష్ణ తెలిపారు. బుధవారం కాచిగూడలోని సొసైటీ కార్యాలయంలో స్వీపర్ అండ్ కామాటీ వెల్ఫేర్ సొసైటీ ఖైరతాబాద్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా అంబికను, ముషీరాబాద్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా గద్దె శ్రీనివాస్‌ను నియమించారు. ఈ మేరకు వారికి నియామక పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపల్ స్వీపర్స్ ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.ఇందిర, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టుపై మంటలతో పరేషాన్



చెట్టు కొమ్మలను తొలగిస్తున్న దృశ్యం

అంబర్‌పేట: వాహనాలు, పాదచారులు రాకపోకలతో రద్దీగా ఉన్న రహదారి పక్కన ఉన్న చెట్టుపై మంటలు చెలరేగడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. బుధవారం బాగ్ అంబర్‌పేట డివిజన్ రెడ్‌బిల్డింగ్ చౌరస్తా వద్ద ఉన్న చెట్టుపై ఉన్న విద్యుత్ కేబుళ్ల నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్పందించిన స్థానిక నేతలు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అనంతరం బీజేపీ సీనియర్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శంభుల శ్రీకాంత్‌గౌడ్‌లు హార్టికల్చర్ విభాగం అధికారులకు సమాచారం అందించి గుబురుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగింప చేశారు.

వృద్ధులకు పింఛన్ల పంపిణీ



పింఛన్లు అందజేస్తున్న కోలేటి దామోదర్

ఖైరతాబాద్: పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ పుట్టిన రోజు వేడుకలను వాసవి సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని వాసవి సేవా కేంద్రంలో కోలేటి దామోదర్ చేతుల మీదుగా 450 మంది పేదలకు వృద్ధాప్య పింఛన్లు అందజేశారు. వాసవి సేవాకేంద్రం అధ్యక్షుడు కొల్బూరు రమేష్, ప్రధాన కార్యదర్శి కాచం ప్రభాకర్, కోశాధికారి ఇల్లూరి నరేందర్, సేవాకేంద్రం జీవిత కాల సలహాదారులు కొండ్లె మల్లికార్జున్, ఆలంపల్లి రవికుమార్, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ కూర జయరాములు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన బీజేపీతోనే సాధ్యం



రామంతాపూర్: రాష్ట్రంలో ఎనిమిది మంది బీజేపీ పార్లమెంట్ సభ్యుల గెలుపులో భాగమై రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి వారి గెలుపునకు కృషి చేసేందుకు, అదేవిధంగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఈటల రాజేందర్ అత్యధిక మెజార్టీతో గెలుపొందడానికి కృషి చేసిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌కు బుధవారం ఉప్పల్ నియోజకవర్గం సీనియర్ నేతలు రామంతాపూర్ బీజేపీ పార్టీ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలియజేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చింతూరు శ్రీనివాస్‌చారి, బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు వేములకొండ సోమశేఖర్‌గౌడ్, రఘుపతిగౌడ్, వెంకన్నగౌడ్, రవీందర్‌రెడ్డి, వాసం పాండు, అంజయ్య పటేల్, ఎ.వి.చారి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న మంత్రి పదవులను భర్తీ చేయాలి



మట్ట జయంతి

కాచిగూడ: తెలంగాణలో ఖాళీగా ఉన్న మంత్రి పదవులను వెంటనే భర్తీ చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని బీసీ మహిళా జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ మట్ట జయంతి సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం కాచిగూడలో ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు కావస్తున్నా కొన్ని ముఖ్యమైన శాఖలకు మంత్రులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా హోంశాఖ, విద్యాశాఖకు మంత్రులు లేకపోవడం వలన ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి వీలులేకుండా ఉందని అన్నారు.

నేడు బీసీ కుల సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం



టి.రాజారాంయాదవ్

కవాడిగూడ: కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి కులగణన బిల్లు పెట్టి దానికి చట్టబద్ధత కల్పించాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారాంయాదవ్ కోరారు. ఈ మేరకు బీసీ కులసంఘాలతో గురువారం ఖైరతాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ రౌండ్‌టేబుల్ సమావేశానికి రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, రాజ్యసభ మాజీ సభ్యుడు బండ ప్రకాష్ ముదిరాజ్, బీఆర్ఎస్ నేత, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ తదితర ప్రముఖులు పాల్గొంటారన్నారు. సమావేశానికి మేధావులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మల్లు రవికి బీసీ నేతల అభినందనలు



ఎంపీ మల్లు రవిని అభినందిస్తున్న గుజ్జ కృష్ణ, నందగోపాల్

కాచిగూడ: నాగర్‌కర్నూల్ ఎంపీగా విజయం సాధించిన మల్లు రవిని బుధవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. మల్లు రవి ఎంపీగా గెలుపొందడం అభినందనీయమని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్, మేరు సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ మేరు తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల నిర్వహణ దైవాధీనం!



నారాయణగూడ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద వీధి దీపాలు

కాచిగూడ: నారాయణగూడ మోడల్ మార్కెట్, ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గత కొద్ది రోజులుగా రాత్రి పగలు అనే తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయి. సమస్యను సంబంధిత జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఏమాత్రం స్పందించడం లేదని స్థానికులు తెలిపారు. విద్యుత్ దీపాలను ఆఫ్ చేయాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యుత్‌ను వృథా అవుతోందని అంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ వీధి దీపాలు పగలు వెలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బీజేపీ నేతల సంబురాలు



నల్లకుంట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందడంతో బీజేపీ నాయకులు బుధవారం నల్లకుంటలో సంబురాలు జరుపుకొన్నారు. కార్పొరేటర్ వై.అమృత ఆధ్వర్యంలో ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద వాహనదారులు, పాదచారులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై కేసుల నమోదు

బంజారాహిల్స్: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి బాణసంచా కాల్చడంతోపాటు ర్యాలీలు నిర్వహించిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-2లోని టీడీపీ కార్యాలయం ముందు హంగామా చేసిన ఐదుగురిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివీ... మోతీనగర్‌కు చెందిన రావుల సురేందర్(38), కూకట్‌పల్లి వీవీనగర్‌కు చెందిన మామిడిపల్లి రఘు(39), అమీర్‌పేటకు చెందిన బత్తుల శశాంక్(36), జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీకి చెందిన కిరణ్‌చౌదరి(36), జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-2కు చెందిన వికాస్ (39)లు గ్రూపుగా ఏర్పడి ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా కాల్చడంతో వారిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

- కూకట్‌పల్లికి చెందిన మహేష్(30), మియాపూర్‌కు చెందిన వెంకటకృష్ణారెడ్డిలు కారులో వచ్చి బీఆర్ఎస్ కార్యాలయం ముందు టీడీపీ జెండాలు ప్రదర్శిస్తూ హంగామా చేయడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారికి ఆల్కాహాల్ టెస్ట్ నిర్వహించగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయ్యింది. ఈ మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.
- జూబ్లీహిల్స్ నుంచి టీడీపీ కార్యాలయం వైపు బైక్‌లు, కార్లతో ర్యాలీగా వెళ్తున్న కాకర్ల వినీత్, సాయికుమార్ తదితరులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సవరణ

పరీక్షల్లో ఫెయిలయ్యానని మనస్తాపం చెందిన ఫిజియోథెరపీ విద్యార్థిని కీర్తి(24) గత నెల 30న షాద్‌నగర్‌లోని ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. కీర్తి హైదరాబాద్‌లోని సుశ్రుత ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ అండ్ రిహాబిలిటేషన్ కాలేజీలో ఫోర్త్ ఇయర్ చదువుతోందని రాయాల్సిన చోట దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలేజీ అని 31న తప్పుగా ప్రచురితమైంది.